Acc. No. 3278

ఆంధ్ర సంస్థానములు :
సాహిత్యపోషణము

(సాహిత్య అకాడమీ బహుమతినందిన రచనము)

డా. తూమాటి దోణప్ప, ఎం. ఏ., పిఎచ్. డి.

అమరచింత : ఆత్మకూరు

ప్రవేశిక

ఇది మహబూబ్ నగరము మండలములోనిది. వైశాల్యము 190 చ.మై. నిజామునందలి పురాతన సంస్థానములలో నొకటి. ఇది పూర్వము అమరచింత, వర్ధమాను అను రెండు పరగణాలు గలదిగా నుండినది. దీనికి మొదటి రాజధాని తిప్పడంపల్లె : ఆతరువాతి రాజధాని ఆత్మకూరు. గద్వాలకు మిక్కిలి సమీపమున ఆత్మకూరు ఉన్నది. రెండింటికిని మూఁడు క్రోసుల దూరము. నడుమ కృష్ణానది మాత్రమే యడ్డు..

సంస్థాన చరిత్రము

సంస్థాన పాలకులు పాకనాటి రెడ్లు. వీరి యింటిపేరు ముక్కెరవారు. వీరి మూలపురుషుఁడు గోపాలరెడ్డి. ఈయన తొలుత తిరుపతి ప్రాంతమునఁగల చంద్రగిరిపట్టణ వాస్తవ్యుఁడు. కాకతీయ చక్రవర్తులకు సామంతుఁడగు గోన బుద్ధారెడ్డి సపరివారముగా తిరుపతి యాత్రకేఁగినపుడీ గోపాలరెడ్డి బుద్ధభూపతి కెన్నో సపర్యలు గావించి మెప్పింపఁగా బుద్ధారెడ్డి గోపాలరెడ్డిని తన రాజధానికిఁ బిలిపించి మక్తల నాఁడగౌడటికము ప్రసాదించి గౌరవించెనఁట. ఇది క్రీ. శ. 1292 నాఁటి మాట. ఇతని కుమారుఁడగు చిన్నగోపిరెడ్డి క్రీ. శ. 1363 లో పంచమహల్ తాలూకా సర్నాడగౌడ వతను కాటభూపతి సన్నదు వలన సంపాదించెనఁట! ఈలోఁగా ఓరుగల్లు పతనమై బహమనీ రాజ్య స్థాపనమునకు పునాదులు లేచినవి. బహమనీ సుల్తానులకు సాయపడిన చిన్నగోపిరెడ్డి ఫిరోజ్‌గడునకు చెందిన సర్కారు ముజఫర్‌నగర్ పరగణాలోని కడేచూరులో నాడగౌడు, సర్నాడగౌడు, దేశముఖి, దేశాయిగిరి, దేశపాండ్యగిరి మున్నగు రుసుములు సులతానుల సన్నదు ద్వారమునఁ బడసెను. వీరి కుమారులు చంద్రారెడ్డి కురుమూర్తి దేవాలయ నిర్మాత.

చంద్రారెడ్డి ప్రపౌత్రుఁడు ఇమ్మడి గోపిరెడ్డి గోలకొండ సులతాను అబ్దుల్లా కుతుబ్‌షాకు సమకాలికుఁడు. గుత్తిముగడ్డ దుర్గము నాక్రమించిన గోపాలరావను నతనిని గోలకొండ సులతాను నానతిపై పట్టి యప్పగించిన ఇమ్మడి గోపిరెడ్డి సాహసమునకు, ప్రభుభక్తికిని సులతాను సంతోషించి ముచ్చింతల, అల్లిపురము అను జాగీరులను ప్రసాదించి పాన్‌సౌ మున్‌సబ్‌దార్ బిరుదము, 200 సవారుల నుంచికొనుటకు హుకుములు జారీచేయించిరి. గోపిరెడ్డి భాగమునకు అమర

చింత, వడ్డెమానులు వచ్చినవి. గోపిరెడ్డి యన్నయగు సాహెబురెడ్డికి కడేచూరు, ముక్తల మొదలగు పైతృక సీమలు సంక్రమించినవి. గోపిరెడ్డి కిద్దరు కొడుకులు. వారు తండ్రి జాగీరును బంచుకొని పాలించిరి. గోపిరెడ్డి యనంతరము సర్వా రెడ్డి పాలకుఁడు. సర్వారెడ్డి పౌత్రుఁడు ఇమ్మడి సర్వారెడ్డి ఆలంగీర్ ఔరంగజేబ్ సేనానికి తోడ్పడుటవలన సంస్థానము విస్తరించుటయు, దుప్పల్లి గ్రామము జాగీరుగా లభించుటయు, జెండా, నగారా, 500 సవారులు మున్నగు గౌరవరాజ చిహ్నములు సంక్రమించుటయు జరిగినవి.

ఇమ్మడి సర్వారెడ్డి కుమారుఁడగు మొదటి తిమ్మారెడ్డి కాలమునాఁటికి పీష్వాల ప్రాబల్యము హెచ్చు కాఁజొచ్చినది. పీష్వాల యాజ్ఞచే నీ సీమలకువచ్చిన రాజా చంద్రసేన జిల్లేదారు తిమ్మారెడ్డికి అమరచింత, వడ్డెమాను పరగణాలను 1702 లో నేఁబదివేలకు గుత్తకిచ్చి, తనపేర చంద్రగడము, తన భార్యపేర ధర్మపురము నను గ్రామములను నిర్మించి వాని దేశముఖి వగైరా రుసుములు వీరికే యొసఁగెను. తిమ్మారెడ్డి మనుమని మనుమఁడయిన రెండవ సాహెబు రెడ్డి కాలము (క్రీ. శ. 1748) న ఆసఫ్‌జాహి ప్రభుత్వము స్థాపింపఁబడినది. ఆసఫ్ జాహికి కర్ణాటక దండయాత్రలలో సాయపడి యిమ్మడి సాహెబు రెడ్డి సవై రాజా బిరుదమును సంపాదించెను. పూర్వపు సనదులను ఖాయపఱుచుటగూడ జరిగి నది. ఇమ్మడి సాహెబురెడ్డి కేడవు తరమువాఁడయిన పెద్ద వెంకటరెడ్డికి హిజరీ 1235 లో సికిందర్ జా నిజాము (క్రీ. శ. 1803–1829) నుండి అమర చింత, వడ్డెమాను పరగణాల పట్టాను, సనదులను నిజాము దివానగు రాజా చందూలాల్ గారిప్పించిరి. ఇతని కాలమునందే రాజధాని తిప్పడంపల్లెనుండి నేఁటి ఆత్మకూరునకు మాఱినది.

వెంకటరెడ్డిగారి పుత్రులు బాలకృష్ణారెడ్డి. వీరి పుత్రులు రాజా సోమభూపాల రావుగారు. వీరికి సురాజుద్దౌలా మంత్రిగా నున్నపుడు రు. 52,201 ల మాఘుకు అమరచింత, వడ్డెమాను పట్టీలను శాశ్వతముగ బిల్‌మక్తాగా సనదు లీఁబడినవి. సర్ సాలార్ జంగ్ హయాములో నీ మొత్తము 70 వేలకు పెరిగినవి. సోమ భూపాలరావుగారి కుమారులు రాజా సీతారామ భూపాలరావుగారు. తమ జీవిత కాలమునందే తమ కుమారులగు శ్రీమంత్ సవైరాజా శ్రీ రామ భూపాల బల్వంత్ బహద్దరుగారికి పట్టాభిషేక మొనర్చిన రాజర్షివర్యులు సీతారామ భూపాల బహద్దరుగారు. శ్రీ రామ భూపాలుగారు క్రీ. శ. 1888 సర్వధారి సంవత్సరములో జన్మించి, విశ్వావసు సంవత్సరమున పట్టాభిషిక్తులై, ప్రమోదూత సంవత్సరమున పరమపదించిరి. శ్రీ రామ భూపాలరావుగారి పట్టపురాణి శ్రీమంత్ సవైరాణి భాగ్యలక్ష్మమ్మగారు. ఈమె దోమకొండ సంస్థానాధీశుల యాఁడుఁబడుచు. విద్యావివేకములు, రాజనీతి నైపుణ్యము గల శ్రీ రాణీ బహద్దరుగారు నిజాము ననుమతిని ఫసలీ 1343 భావ సంవత్సరమునందు

అమరచింత - ఆత్మకూరు సంస్థాన పట్టమునకు వచ్చిరి.

సాహిత్యపోషణము

వితరణ గుణమునను, విద్వత్పోషణమునను, కావ్యకళా మర్మజ్ఞత్వమునను గద్వాల-అమరచింత పాలకు లుభయులును ప్రతిభటత్వమునెఱపి సాహితీ క్షేత్రమున బంగారు పంటలు పండించిన విద్వత్ప్రభువులు. ఒక్క తెలుగేకాక సంస్కృతమును, ఒక్క సాహిత్యమేగాక సర్వశాస్త్రములును, సంగీతాదీతర కళలును వీరి ప్రాపును ప్రోపును బడసి పెంపొందినవి. ఆత్మకూరు సంస్థానము నందు ఏఁటేఁట ఫాల్గున శుక్ల పక్షమున సాహిత్య సభలు, శాస్త్ర గోష్ఠులు, కవి గాయక సమ్మేళనములు, నృత్యనాటక ప్రదర్శనములు ప్రవర్తిల్లుచుండెడివి. కవి పండితాదులకు అర్హరీతిని సత్కారములు జరుగుచుండెడివి.

నిజామురాష్ట్ర నివాసియగు సురపురపు కేశవయ్య ఆత్మకూరు సంస్థాన కవులలో ముఖ్యుఁడు. ఇతఁడు 1760 ప్రాంతము వాఁడు. ఈతని నిరోష్ఠ్య రామాయణమను ప్రౌఢకావ్యము ఆత్మకూరు సంస్థానాధీశ్వరులు శ్రీ రాజా సోమభూపాలున కంకితము. ఈ కృతి పూర్తిగా లభ్యము గాలేదు.

తిరుమల బుక్కపట్టణము రంగాచార్యులుగారు ఆత్మకూరాస్థానమునందలి విద్వత్కవులు. ఈయన బాలసరస్వతి బిరుదాంకితులగు తిరుమల బుక్కపట్టణము శ్రీనివాసాచార్యులుగారికి పితృవ్యులు. గుణరత్నాకర, పద్మినీ పరిణయ చంపువు లను గీర్వాణకృతు లీయన రచనలు.

తర్కతీర్థ, బాలసరస్వతీత్యాది బిరుద విరాజితులగు తిరుమల బుక్కపట్టణము శ్రీనివాసాచార్యులుగారు (1863—1919) ఆత్మకూరాస్థానకవులు, పండితులు. చిన్నారిపొన్నారి చిఱుతవయసునుండియే కవిత నల్లనేర్చిరి. శత ఘంటా కవనమున అద్వితీయ ప్రతిభా పాండిత్యములను బ్రదర్శించిన పండితుఁడు. ఎనిమిది తరములుగా నీతని వంశీయులు విద్వత్కవులుగా, శాస్త్ర పండితులుగా, విశిష్టాద్వైత ధర్మ ప్రతిష్ఠాతలుగా ప్రసిద్ధులయినవారు. శ్రీనివాసాచార్యులుగారు ఇందోరు, గ్వాలియర్, దర్భాంగా, ధారానగరము మొదలగు సంస్థానములయందు తమ వైదుష్యమును బ్రదర్శించి మెప్పులందినవారు. అవధానములు, సంస్కృత ప్రాకృతాంధ్రములలో ఆశుకవితా ప్రదర్శనములు వీరి కభిమాన విద్యలు. శతావధానులు తిరుపతి వెంకట కవులతో శాస్త్రార్థముచేసి ఆఱు నెలలవరకు బ్రహుసత్కారము నొందినని మహాపండితులు. వీరిని గుఱించి తిరుపతి వెంకట కవులలో నొకరయిన కళాప్రపూర్ణ శ్రీ చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి గారు ప్రకటించిన యభిప్రాయము నిచ్చట నుదాహరించుట సుసంగతము :

'ఆ (ఆత్మకూరు) సంస్థానంలో ఒక పండితుఁడున్నాఁడనిన్నీ ఆయన నాలుగు శాస్త్రాలు వచ్చినవారనిన్నీ, ఆశుకవిత్వము చెప్పేవారనిన్నీ,

చాలా సమర్థులనిన్నీ చెప్పడం మాత్రం వింటూ వున్నాము. ఆయన కున్నంత పేరు ఆ ప్రాంతంలో యెవ్వరికిన్నీ లేదు... ....'

శ్రీనివాసాచార్యులుగారు జాంబవతీ పరిణయము, తత్త్వమార్తాండ ప్రభామండలము, దుర్మదనిర్మథనము, నంజరాజ చంపువు, రాజశేఖర చరిత్రము, సురపుర వేంకటగురు చరిత్రము మున్నగు కృతులను రచించినవారు.

ఆత్మకూరు సంస్థానమునందలి మఱియొక విద్వత్కవి దీక్షితుల నరసింహ శాస్త్రిగారు. సంస్థానమువారు వీరికి మహాకవి బిరుదమును ప్రసాదించిరి. లక్ష్మీ పరిణయము, విదురాశ్వత్థ మాహాత్మ్యము, శ్రీరంగ మహోత్సవ వర్ణమాలిక, సత్యనారాయణ వ్రతకల్పము మున్నగునవి వీరి కృతులు.

అలంకార మణిమాల, ఆచార్య వింశతి, మహాంతర్లాపమాల మున్నగు గ్రంథములను రచించిన భారతి దీక్షాచార్యులుగారును, లక్ష్మీసహస్ర వ్యాఖ్యా కర్తయగు అరిశాణపాలెము వెంకటాధ్వరియును, ఆశుకవితా విశారద జాతర విద్వన్మణి తిరుమల వేంకటాచార్యులును, చెంచునాటక హనుమచ్ఛతకాది కావ్యకర్తయగు దీక్షితుల పాపాశాస్త్రియును, వ్యాకరణ వేదాంత శాస్త్ర విశారదుడు తిరుమల బుక్కపట్టణము బుచ్చి వేంకటాచార్యులును, వ్యాకరణ మీమాంసా వేదాంతాదిశాస్త్ర పారీణుఁడగు ముదిగొండ నాగలింగ శాస్త్రియును, తిరుమల బుక్కపట్టణము కృష్ణ దేశికాచార్యులును ఆత్మకూరు సంస్థానాస్థాన కవి పండితులలో కొందఱు.

అటు గద్వా లిటు చెన్నపట్టణము దాఁక౦ గల్గు సమస్తాంధ్రోర్వర యందుఁ ప్రసిద్ధి వహించిన తిరుపతి వెంకట కవులకు ఆత్మకూరు సంస్థాన పాలకులు సలిపిన సమ్మానములు జగత్ప్రసిద్ధములు. నాఁటి యాత్మకూరు ప్రభువు ముక్కర సీతారామ భూపాలుఁడు. ఆంధ్రదేశమంతట ఆబాలగోపాలము రసనలయందు చిందులాడిన రసనిష్యందితుందిలములగు పద్యములు,

'వేసవి దగ్గఱాయె ఓయు పిసుటకున్ మన సొగ్గదాయె........',
'ఏనుఁగు నెక్కినాము ధరణీంద్రులు మ్రొక్కఁగ నెక్కినాము........'.
'దోసమఁటంచు వెఱింగియును దుందుడుకొప్పఁగఁ బెంచినార మీ
మీసలు రెండు బాసలకు మేమె కవీంద్రుల మంచుఁ దెల్పఁగా........'

మున్నగునవి ఆత్మకూరు సంస్థాన గోష్ఠులలో నవతరించి సంస్థానపాలకుల సాహిత్యమూర్తికి కీర్తి పతాకలయినవి. తిరుపతి వెంకటకవుల శ్రీనివాస విలాస కావ్యము సీతారామ భూపాలున కంకితము. ఈ కృతి సమర్పణ సందర్భమును తమకు జరిగిన సమ్మానాదికముల గుఱించి నానారాజ సందర్శన సందర్భమును తిరుపతి వెంకట కవులు ఆత్మకూరు పాలకుల బహూకారములు కైవారము చేసినారు :

* కథలు—గాథలు, సంపుటము 1, పుట 496.

'సరసత నాత్మకూరు నృపసత్తముఁడొక్క ప్రబంధరాజమున్
విరచన చేయఁజేసి యది విద్వదుపాస్యముఁటంచు మెచ్చి యా
దరమునఁ జంద్రహారములు ద్రవ్యము సేలువ లట్టులుండ వి
క్కరికెనయైన యేన్గుపయి గ్రంథముతో మము వాదుకొల్పి త
త్పురవరమేఁగఁజేసి యిడె భూమియు........'

——నానారాజ సందర్శనము, పు. 102–103.

'ఆత్మకూరు రాజు నడిగిన నిచ్చె మేల్ వసతి రెండు నూర్లు వచ్చునదియు'

——పైది, పు. 113.

'తగనాత్మకూరు సీతారామ భూపాలుఁ డేన్గు నెక్కించి యూరేఁగఁజేసె'

——పైది, పు. 115.

'ఆత్మకూర్పాడ్రజ్య మదేభముల నెక్కి వీథులలో విఱ్ఱవీఁగి చనుట'

——కథలు-గాథలు, సంపుటము 1, పు. 505.

శ్రీనివాస విలాసము మహోపకాల నామక కవిసార్వభౌమ కృతమగు చంపువు. దీనిని ఆత్మకూరు నృపాలుని యాజ్ఞమీఁద తిరుపతి వెంకట కవులాంధ్రీకరించి సీతారామ భూపాలున కంకితమిచ్చిరి. ఆత్మకూరు రామభూపాలుని మీఁద తిరుపతి వేంకట కవులు చెప్పిన పద్యము :

'ధరణీనాథులు రాజరాజనుచు, విద్వాంసుల్ బుధుండంచు, సుం
దరులెల్లన్ మదనుండఁటంచుఁ, గరుణాధారుండఁటంచున్ ద్విజుల్
సరసుండంచుఁ గవీశ్వరుల్ పొగడ రాజ్యశ్రీలపర్ధిల్లు ము
క్కర వంశాంబుధి చంద్ర! నిస్తుల యశస్కా! రామభూపాలకా!'

——నానారాజ సందర్శనము, పు. 71.

కార్యమపూఁడి రాజమన్నారు కవి (1846–1917) ఆత్మకూరు సంస్థానాధీశ్వరుల కోరికమేరకు శ్రీ సీతారామ భూపాల విలాసమను కావ్యమును గైసేసిరి. వీరు గుంటూరు మండలమువారు. ఆశుకవితలో ససమాన ప్రజ్ఞ గలవారు; ఆత్మకూరు సంస్థాన సమ్మానితులు.

ఆత్మకూరు పాలకులు శ్రీమంత్ సవై రాజా సీతారామ భూపాలరావుగారు విద్వత్కవుల కుటుంబములకు పెక్కింటికి తమ సంస్థానమునం దాశ్రయము కల్పించిన విద్యాపోషకులు. రాజా శ్రీరామ భూపాలరావు బల్వంత్ బహద్దరుగారి పట్టపురాణి శ్రీ భాగ్యలక్ష్మమ్మగారు తమ మామగారును, భర్తగారును నడచిన త్రోవలో విద్యాపోషణమును గావించి, సాటివారిలో మేటియని పేరందిన సాధ్వీమణి.

నిజామురాష్ట్ర కవి జీవిత పరిచయ గుచ్ఛమగు గోలకొండ కవుల సంచిక శ్రీ భాగ్యలక్ష్మమ్మ బహద్దరువారి సమాదరణమునఁ బ్రకాశితమయిన బృహద్గ్రంథము. సంచికా సంకలన సదుద్యమమును విని యామె ప్రచురణ భారమును

వహించి ఆంధ్ర భాషాభిమానమును నిరూపించిరి. ఇది శ్రీ రాణీ బహద్దరుగారి నిర్మల యశస్సౌరభము నిఖిలాంధ్ర ప్రపంచమున చిరస్థాయిగా ప్రసరించునట్లు సమర్పితము. ఈ సందర్భమునందు కవి పండితు లొసంగిన ఆశీః పూర్వక పద్యములలో కొన్ని :

'శ్రీమద్దివ్యరథాంగ శంఖ సుమహా పద్మాది సర్వాయుధైః
శ్రీమత్కౌస్తుభ దివ్య హారమణిభి శ్శ్రీవత్స చిహ్నాదిభిః
యుక్త శ్రీపతి రేష నిత్య మవతు శ్రీ భూమి నీళాదిభిః
శ్రీ రామావనిపాలమౌళి మహిషీమ్ శ్రీ భాగ్యలక్ష్మ్యంబికామ్'

—తిరుమల బుక్కపట్టణము వేంకటాచార్యులు.

'స్థిర సామ్రాజ్యమనామయంబు జయలక్ష్మీ వ్యాప్తి శశ్వద్యశ
స్స్ఫురణం బండిత పోషణాభిరతి సంపూర్ణానుకంపాప్తియున్
బరమౌదార్యము నైజపాదభజన వ్యాసంగమున్ గూర్చి శ్రీ
కర కుర్మార్తి గిరీశుఁడోము నిను దీక్షన్ భాగ్యలక్ష్మ్యంబికా!'

—దీక్షితుల నరసింహశాస్త్రి.

ఉపజీవ్య గ్రంథసూచి

1. సురవరము ప్రతాపరెడ్డి, గోలకొండ కవుల సంచిక, ఆత్మకూరు సంస్థాన చరిత్ర.

2. సురవరము ప్రతాపరెడ్డి, నిజాము రాష్ట్రములోని ఆంధ్ర సంస్థానముల చరిత్ర, శ్రీకృష్ణదేవరాయాంధ్రభాషా నిలయ రజతోత్సవసంచిక, పు. 49.

3. తిరుపతి వేంకట కవులు, నానారాజ సందర్శనము, పుటలు 52–61, 71–78 102, 103, 113, 115, 120.

4. తెలుగు విజ్ఞాన సర్వస్వము, సంపుటము 3.

5. వేపులపల్లి రామానుజరావు, తెలుగు సీమలో సాంస్కృతిక పునరుజ్జీవనము పుటలు 94, 95.